# శేషయ్య ధర్మకర్తయ్యాడు!

★

ముట్నూరి
సంగమేశం

★

శైవం పిడికిలా? శేషయ్య పిడికిలా? అంటే శేషయ్యదే గట్టి అన్న సంగతి లిఖితమే అయిపోయింది నాయుడుగారి సావిట్లో మునుపు. అలాటి శేషయ్య అమాంతంగా సంచులు కోసి జల్లేస్తున్నాడంటే మాలో కొందరికి మతే పోయింది. వాడవాడంతా అదే మాట.

పొలమన్న పొలమా? బంగారం. వద్దంటే రెండు గరిశెలు పండుతుంది. అలాటి దడం చేత్తో యిచ్చేశాడంటే, యింకా కర్ణుడెందుకు, దధీచెందుకు'' అన్నాడు అప్పయ్యశాస్త్రి బొజ్జ నిమురుకుంటూను.

వెధవపొలం ఓ లెఖ్ఖా! చేతి నున్నవి— మొన్నే చేయించుకొన్నవి-సింహతలాటం మురుగులు దీసి వెంకన్న కిచ్చేస్తే పొలమంటూ వేమిటోయ్ యింకానూ'' అన్నాడు రామయ్యమామ విసుక్కుంటూను.

''వెనకవీధిలో యిల్లుగూడా ధారపోసేస్తాట్ట'' అన్నాడు శంకరం ఆమధ్యనుంచీను. వింటూన్న వాళ్లందరికీ వెర్రెత్తినట్టుగాను మతిపోయినట్టుగాను అయింది. అసలు ఎందుకీ విధంగా తెగించి దానంచేస్తున్నాడో అనే విషయం పది మందీ పది విధాల అనుకొంటున్నారు.

తాతలనాటినుంచి అవిచ్ఛిన్నంగా వస్తూన్న ఆస్తిని ఆవంతైనా ఖర్చుపెట్టకుండా అనువైనంత వరకు వృద్ధిచేస్తూ, అన్యాయానికీ, అపకీర్తికీ కూడా వెరవని శేషయ్య. తన కంఠంలో ప్రాణముండగానే ఆ యిల్లూ, భూములు, ఆ తోటలు అన్నీ తన చేతో టే దానం చేసేస్తున్నారంటే మరి వింత గాదూ ?!

మండు రెండుఝాముల వేళప్పుడు ఆకలితో [illegible]గం తిరుగుతూవచ్చి పచ్చి మంచినీళ్ళయినా యిమ్మంటే ఆ చేత్తో యివ్వలేకపోయిన వ్యక్తి. ఉన్నట్టుండి యీవాళ వెన్నముద్దలా కరిగిపోతూ వుంటే మరి ముక్కుమీద వేలేసుకోవలసిందేనా? కాదా!

ఇంతకీ యీ తెగింపుకి కారణం ఉండదా? అని మాలో కొందరం వాదించుకున్నాము. ''కల్లో దేవుడు కనిపించి చెప్పేట్ట!'' అన్నారొకరు. ''మొన్నవల్లో జ్యోతిష్కుడు వచ్చి, యింక మూడు నెలలే నీకు ఆయుర్దాయం. శాంతి చేసి ధర్మంచేస్తే యింకా ముప్ఫైయేళ్లు బ్రతికి ముగ్గురు పిల్లల్ని కంటావని చెప్పేట్ట!'' అని ఒకరు. ''ఏలూర్లోవున్న వేలువిడిచిన మేనత్త చచ్చిపోయిందట. దాని ఆస్తి కలిసిందిట'' అని యింకోరు. ''మొన్నటి జమీందారుగారిమీది దావాలో గెలిచాట్ట అదే యిది'' అని మరొకరు ప్రారంభించేరు.

ఇంతట్లో చావకా బ్రతకనా అని ఉన్న ఆవుని మెడలో గావంచా కట్టి యీడ్చుకొస్తున్నాడు సూరావధాని దానం పట్టి.

''ఏం? అవధాన్లు! శేషయ్య యిచ్చిందేనా?'' అన్నాం.

"ఆ. అదే. దీనితో పాటు ముప్ఫైరూపాయలు దక్షిణకూడా పెట్టాడు" అన్నాడు అవధాని.

"బాగుందోయ్. పోనీగాని ఎందుకో యీ ధర్మం ఇలా చేస్తున్నాడు, నీకేమన్నా తెలుసా? అని ప్రశ్నించేడు మా తమ్ముడు.

"అయ్యో! యింకా తెలియదేమిటి మీకు!'' అంటూ అలా ఉన్నవాడున్నట్టే నిలబడిపోయా

* ఆనందవాణి

డు అవధాని. మా చెవులన్నీ ఆవుచెవుల్లా నిక్క పొడుచుకొని వున్నాయి అతనేమి చెప్పేది వినేద్దామని.

"శేషయ్య పిన్నత్తగారి తమ్ముడు పెద్ద ఆస్తిపరుడు. పెళ్ళాం పిల్లలు లేనివాడు. చనిపోతూ చనిపోతూ తన యావదాస్తినీ దాన ధర్మాలక్రింద వినియోగించవలసిందని వీలునామా వ్రాసి శేషయ్యని ధర్మకర్తగా నియమించేట్ట! ప్రతి దినవారాలకి పోను శేషించినదంతా శేషయ్య దానంచేసేస్తున్నాడు అవధాని.

"ఏమాత్రమేమిటి ఆ ఆస్తి?" అని అడిగేను.

"సుక్షేత్రంగా అయిదువేలు సాలీనా రాబడి వచ్చే స్థిరం, పదివేలు చరం వున్నాయట. ఆ ముసలాడికి యిరస్తా పరస్తా మరెవ్వళ్ళూ లేరట" అన్నాడు అవధాని.

"అదీ కారణం. లేకపోతే శేషయ్య దానం చెయ్యడం ఒకటూ!" అన్నాడు మావాడు.

"ఇందులో తనెంత మిగుల్చుకున్నాడో!" అన్నాడు మా వెంకట్రావు. అవధాని ఆవు నీడ్చుకొని వెళ్ళిపోతున్నాడు. "అవధానీ, అవధానీ, నిలబడు, నిలబడు" అంటూ కేకలేసుకుంటూ, రొప్పుకుంటూ వస్తున్నాడు రామయ్య. అందరి కళ్ళూ ఆ ప్రక్క తిరిగేయి. అవధాని వెనక్కి తిరిగి నిలబడ్డాడు.

"సరి. ఆవుని పట్టుకుపోతున్నావా! చాల్లే వయ్యా. అప్పుడే మరిచిపోతూ? వొదులొదులు!" అంటూ వచ్చేరావటం తడవుగా అవధాని చేతిలో వున్న గావంచా గుంజాయించి ఆవుని వెనక్కి మళ్ళించేడు రామయ్య.

"ఇదేమిటోయ్ ఇచ్చింది మళ్ళించేస్తున్నావు" అన్నాడు.

"ఎవళ్ళండీ యిచ్చేడు! ఆస్తి వున్నదని ఆ చచ్చిన వెధవ శాస్త్రి అవును గాబోలనుకొని యిచ్చేట్ట. దాని తలమించినంత అప్పుకూడా వుందట ఆ ఆస్తిమీద. చరం అసలే లేదట. తన చేతి వో మూడువందలు ఖర్చు అయిపోయాయి దినవారాలకని ఏడుస్తున్నాడు శేషయ్య" అన్నాడు రామయ్య ఆవు నీడుస్తూను.

"అదిరా! శేషయ్య తమాషా!" అన్నాడు మావాడు.

ఎక్కడివాళ్ళం అక్కడే తెల్లబోయి వుండిపోయాం.




జమ్మి వెంకటరమణయ్య గారి 'లివర్ క్యూర్' ప్రఖ్యాతిగాంచిన వైద్యులు దీనిని వైద్య శాస్త్రములలోకెల్ల నూతన విజయోత్పన్నముగా శ్లాఘించుచున్నారు.

అందరి కెమిస్టుల వద్ద దొరకును. లేనిచో క్రింది విలాసమునకు వ్రాయుడు.

జమ్మి వెంకటరమణయ్య & సన్స్,
1/1, బ్రాడీస్ రోడ్డు, మైలాపూర్, మద్రాసు.
ఇంకను : బొంబాయి, కలకత్తా, లక్నో, బెంగళూరు, తిరుచినాపల్లి విజయనగరములందు కూడ ఆఫీసులు గలవు.